# 23. వ్యాపారం

ఎన్నిసార్లు పార్టీలు మార్చిమార్చి ఓటేసినా తనపరిస్థితి మారకపోగా నిరాశా నిస్పృహలకులోనై ఎవరికోటేసినా లాభంలేదనుకొని – మళ్ళీ ఓటేసే రోజు రాగానే ఈసారి ఫలానా పార్టీకేసి చూద్దామని కొన ఆశతో పోలింగ్‌బూతుకెళ్ళే అమాయకపు ఓటరులా మళ్ళీ చెట్టుదగ్గరికెళ్ళాడు రాజానందం. చెట్టుపైకి పాకి శవాన్ని భుజంపై వేసుకొని మెల్లమెల్లగా కిందికి దిగి శ్మశానం దిక్కున నడుస్తున్నతనితో భేతాళుడు

" నన్ను స్వాధీనం చేసుకోవాలన్న నీ దృఢదీక్ష సంతోషదాయకమే కాని నువ్వేం కోరదలచుకున్నావో చెప్పు" అన్నాడు.

"ఈ భేతాళుడు పెన్షన్ క్లర్కుకన్నా చాలుగాన్లా వున్నాడు నన్ను మాటల్లోకిదించి మాయం కావాలని చూస్తున్నాడు ఇతడెంత ప్రయత్నించినా మాట్లాడొద్దు అయినా ఎవరికి చెప్పుకున్నా వచ్చేదేముంది...? నాకు రావాల్సిన పెన్షన్ గురించి కాళ్ళరిగేలా తిరుగుతున్నాను ఎందరి కాళ్ళు పట్టుకున్నా ఫలితం శూన్యం. లంచమిచ్చి పనిచేయించుకుందామంటే ఊర్నిండా అప్పులే. ఏం చెయ్యాలో తోచక ఈ ప్రయత్నం చేస్తున్నాను...' తనలో తాననుకొని గబగబా నడుస్తున్నాడు రాజానందం. తనమాటలకు జవాబు రాకపోయేసరికి భేతాళుడు "నిన్ను మాట్లాడించడం నాకో సమస్యకాదు. సరే బరువైన నన్ను మోస్తున్న నీకు శ్రమతెలియకుండా ఉండడానికో కథ చెబుతాను విను..." అని కథ చెప్పసాగాడు.

అది ఆరుకోట్లకు పైగా జనాభా కల్గివున్న ఆంధ్రదేశంలోని ఓ పారిశ్రామిక ప్రాంతం. అందులో అదొక చిన్న కాలనీ. ఆ కాలనీలో అత్యాధునిక టెక్నాలజీతో కట్టిన పరిశ్రమలో పనిచేసే విద్యావంతులైన

యువకులే ఎక్కువ మందున్నారు వాళ్ళంతా నవనాగరికులుగా చలామణి అవుతూ మంచి జీతం తీసుకుంటున్నారు. ఆ కాలనీలో ఓ కూరగాయల మార్కెటుంది. అక్కడ రెండుమూడు పర్మనెంటు కూరగాయల దుకాణాలున్నాయి. వాళ్ళతోపాటు ఆ కాలనీకి చుట్టుపక్కలున్న పల్లెల్నుండి చిన్నచిన్న రైతులు కూరగాయలు తీసుకొచ్చి అమ్ముతుంటారు. వాళ్ళు జామురాత్రిలేచి కూరగాయలు తెంపి గంపల్లో వేసుకొని మైళ్ళదూరం నడిచొచ్చి తెల్లవారక ముందే మార్కెట్లో వుంటారు. పగలువరకమ్ముకొని వెళ్ళిపోతుంటారు. అక్కడే కాపు ముత్తయ్య గత రెండేళ్ళుగా కూరగాయలమ్ముతున్నాడు.

ముత్తయ్యకీ పనిలో ఎన్నో ఎన్నో అనుభవాలు. దుకాణం పెట్టుకొని అమ్మేవాళ్ళ దగ్గర ఒక్కమాట మాట్లాడకుండా కొనేవాళ్ళు తనలాంటి వాళ్ళ దగ్గరికొచ్చేసరికి గొడవచేయడం, కొసరి బేరమాడటం చూసాడ తను తనలాంటివాళ్ళు మొగ్గుపెట్టి కొంచెం ఎక్కువే తూచినా ఇంకోటి వ్వమని జబర్దస్తీ చేయడం గమనించాడు చదువుకున్న ఉద్యోగులు గొడవపడి కూరగాయలమ్మనీయమని గొడపపడటం, బెదిరించడం ఆతని అనుభవంలోకొచ్చింది ఒళ్లు హూనం చేసుకొని పండించి తెచ్చిన కూరగాయలకు తన దగ్గర ధరపెట్టి కొనడానికేడ్చేవాళ్లు. మధ్య దళారీలవద్ద అడిగిన ధరనిచ్చి కొనడం అతనికి బాధ కల్గించింది. అతడెన్నో చేదు అనుభవాలు పొందాడు.

"గా ఎడుగులపొంట కాసే దొండకాయలు రూపాయికి సవశేరా?

"గా కాకరకాయలకు రెండు రూపాయలా?

అని వాళ్లు దెప్పడం చూసాడు దుకాణం వాళ్లు పావుకిలో [260 (గ్రా) చొప్పన తాను సవాశేరు (350 గ్రా) చొప్పున ఇచ్చిన వాళ్లు తనపై జులుం చేయడం అతనికి బాధ కలిగించింది. మొదట్లో ప్రతిమాటకు బాధ

పడిన ముత్తయ్య మెల్లమెల్లగా వాళ్లకు సరైన సమాధానాలు చెప్పడం ప్రారంభించాడు. పదే పదే అతన్ని కించపరిచే ఇద్దరు యువకులతని దగ్గర బెండకాయలు కొంటున్నారు రూపాయిన్నరకు సవశేరన్నాడతడు

"మీ తోటలో పండేవాటికింత ధరా ? అన్నాడొకాయన.

"వాట్ని పండిచటానికెంత కష్టపడన్నో మీకు తెలువది సార్"

"మా చెప్పినవుగని రూపాయికివ్వు"

"పడది సార్..."

"కరీంనగర్ల రూపాయికి సవాశేరు తెలుసా...."

'ఎక్కడిధరక్కన్నే సార్... హైదరాబాద్ పోతే ఇంకా తక్కువ ధరుంటదేమో..? అని ' మీరేమనుకోనంటె సిన్న శాత్రిం సెప్పుత ఇనుండ్రి.? అన్నాడు ముత్తయ్య. అని చెప్పసాగాడు.

ఒకాయన కొబ్బరికాయల బేరం సేత్తాండు మీ అసొంటయినె కొబ్బరికాయె కావన్నని అయినె దగ్గరికి పెయిండు, మూడు రూపాయల కోటని ధర జెప్పిండు. రెండున్నర కియ్యమన్నడు ఇశాకపట్నంబోతే రెండు రూపాయలకే ఇత్తరు పొమ్మన్నడు అమ్మెటయినె ఇశాకపట్నం బొయ్యి రూపాయి కోటియ్యమన్నడీనె ... అక్కడమ్మటయినె కేరళకు బోతె అర్ధకోటే దొరుకద్ది పొమ్మన్నడు సంబర పడుకుంట కేరళకు పెయిండయినె .. అక్కడ పావలకోటియ్యమన్నడు అక్కడమ్మటయినె సముద మొద్దుకుపోతె అట్టిగనే దొరుకుతయి పొమ్మన్నడు. ఈనె సముద్రపొద్దుకు పొయ్యి సెట్టెక్కి తెంపుకుంటండు. ఆపేచ్చకొద్ది. వట్టిగత్తన్నయని బాగ తెంపుకుంటండు. తెంపుకుంట తెంపుకుంట కాల్జారి సముద్రింల పడి సచ్చిండు ...

'బలెటోనివున్నవు పెద్దమనిషి...' అంటూ డబ్బులిచ్చి వాళ్లెళ్లి

పోతారు.

ఆ తర్వాతెప్పుడూ వాల్లు ముత్తయ్యను సతాయించలేదు.

కథ చెప్పడం పూర్తిచేసాడు భేతాళుడు

'చదువు సంస్కారం వుందనుకున్న ఆయువకులెందుకు ముత్తయ్యను సతాయించేవారు... ?

కథ చెప్పింతర్వాతెందుకు చూసుకున్నారు . ?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పక పోయావో బాగుండదు అని మౌనం వహించాడు భేతాళుడు

"ముత్తయ్యలాంటివాల్లను సతాయించేది చదువుకున్న వాల్లు నిజమే వాళ్ళకు సంస్కారం వుండాలి, కాని ఈ చదువులు సంస్కారాన్ని గూర్చి చెప్పడం లేదు, తమకక్షరజ్ఞానం కలిగి ఉద్యోగముండగానే మరికి బట్టల్తో నల్లనల్లగా వున్న వ్యవసాయం చేసుకునే వాళ్ళు వాళ్ల కళ్ళకు చులకనగానే కనబడతారు తమ అతి తెలివిని వాళ్ళ ముందు ప్రదర్శించాలని కొంతమంది ప్రయత్నిస్తారు అందులో భాగమే ఈ సతాయింపు ముత్తయ్యను సతాయించిన వీళ్ళు దుకాణం పెట్టుకొని అమ్ముకొనే మార్వాడిలాంటి వాని జోలికెళ్ళరు. ఎందుకంటే అతడు వెంటనే జవాబిచ్చి వీళ్ళనోళ్ళు మూయిస్తాడు,

ముత్తయ్య కథ చెప్పేసరికి వాళ్ళకు దిమ్మ తిరిగింది. తాము అనాగరికుడుగా తెలివితక్కువ వాడుగా భావించిన ముత్తయ్య తమనంత దెబ్బతీస్తాడనుకోని యువకులు అటు తర్వాత నోరుమూసుకున్నారు...."

రాజానందం నుండి తానాశించిన జవాబులు రాగానే శవంతోపాటు మాయమై చెట్టెక్కి కూర్చున్నాడు భేతాలుడు.

[ జీవగడ్డ ఫిబ్రవరి, 1987 ]